క్లుప్తంగా

గ్రామాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది

మిడ్జిల్: గ్రామాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోందని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ స్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ సుదర్శన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనువాస్‌రెడ్డి, మిడ్జిల్ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆచారి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



దేవరకద్ర రూరల్: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని ఇస్రంపల్లి సర్పంచ్ శివరాజ్ అన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చొరవతో ఎంపీ నిధులతో శుక్రవారం గ్రామంలో రూ. 15 లక్షలతో ముదిరాజ్, యాదవ, వాల్మీకీ కమిటీ హాల్‌ల నిర్మాణాలకు సంబంధించిన పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్‌లో గందరగోళం!

జడ్చర్ల: ఇంటర్‌లో చేరేందుకు ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లిన ఓ విద్యార్థికి గందరగోళ పరిస్థితి ఎదురైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత విద్యార్థిని ఇందు కథనం మేరకు... ఇద్దాన్‌పల్లికి చెందిన ఆమె తమ గ్రామానికి దగ్గరగా ఉన్న బాలానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరడం కోసం శుక్రవారం కళాశాలకు వద్దకు వెళ్లింది. ఆమె హాల్ టికెట్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో తనిఖీ చేయగా సదరు విద్యార్థి ఇంతకు ముందే జడ్చర్ల ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం పొందినట్లుగా చూపిస్తుందని అక్కడి సెక్షన్ అధికారులు చెప్పారు. దీంతో ఆమె అవాక్కయ్యింది. ఇటీవల ఓ లెక్చరర్ తమ ఇంటికి వచ్చి హాల్‌టికెట్ అడిగితే ఇచ్చానని, తరువాత తన నంబర్ ట్యాబ్‌లో ఎంట్రీ చేసి వెళ్లారని అప్పట్లో తనకు ఈ విషయం తెలియదని వాపోయింది. ప్రస్తుతం బాలానగర్‌లో అడ్మిషన్ ఇవ్వాలని కోరగా డెలిట్ ఆప్షన్ తమ పరిధిలో లేదని ప్రిన్సిపాల్ తెలిపారని వాపోయింది. విషయంపై జడ్చర్ల కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణను వివరణ కోరగా రెండురోజుల్లో ఆప్షన్‌లో డెలిట్ చేస్తామని, విద్యార్థిని అనుమతి లేకుండా ఎలా అడ్మిషన్ జరిగిందో తెలియట్లేదని చెప్పారు. కాగా తనకు బాలానగర్ కళాశాలలోనే అడ్మిషన్ లభించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థిని ఇందు విజ్ఞప్తి చేసింది.

ప్రైవేట్‌కు దీటుగా వసతులు

పాలమూరు: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేశామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రూ.కోటీ వ్యయంతో నూతనంగా నిర్మించిన రేడియాలజీ హబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఎక్స్-రే, 2డీ ఈకో, మామోగ్రామ్, ఈసీజీ, అల్ట్రాసౌండ్,సీటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దీని ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ ముందుగా గుర్తించి అవసరం అయిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 54రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, రాబోయో రోజుల్లో 134 రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి వస్తాయన్నారు. అన్ని సౌకర్యాలతో పాత కలెక్టరేట్ స్థానంలో రూ.వెయ్యి కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు నాడు-నేడు తెలంగాణ అనే శీర్షికతో నాటక ప్రదర్శన నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్, డైరెక్టర్ రమేష్, డీఎంహెచ్‌వో కృష్ణ, డాక్టర్ జీవన్, వైద్యులు రాధ, హనుమంత ప్రసాద్, నవల కిషోర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

పట్టణాల రూపురేఖలు మారాయ్



భూత్పూర్‌లో మున్సిపల్ అభివృద్ధి కర పత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మహిళా సంఘాల వారికి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

జడ్చర్ల: రాష్ట్ర ఆవిర్భావానంతరం పట్టణాల రూపురేఖలు మారిపోయాయని, అభివృద్ధి దిశగా దూసుకుపోతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. కావేరమ్మపేటలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. గతంలో జడ్చర్లలో ఒక్క పార్కు లేకపోయిందని, ఇప్పుడు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా గ్రేడ్-2 గా ఉన్న మున్సిపాలిటీని గ్రేడ్-1గా మారుస్తామన్నారు. త్వరలోనే రూ.30 కోట్లతో పట్టణంలో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులను చేపడుతామన్నారు.నల్లకుంట, నల్లచెరువులను మినీ ట్యాంక్ బండ్‌గా మార్చి అభివృద్ధి చేశామన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేశామని తెలిపారు. ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్న ఘనత తమదేనన్నారు. గతంలో వేసవి కాలం వచ్చిందంటే తాగనీటికి గోస తీవ్రంగా ఉండేదని గుర్తు చేశారు. కావేరమ్మపేటకు డబుల్ రోడ్డు, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటీవలే జడ్చర్లలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభించామని పేర్కొన్నారు. కావేరమ్మపేటలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యలు రాకుండా చేశామన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం వంటి కార్యక్రమాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అన్ని రంగాల్లో అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం పాటు పడుతుందని వివరించారు. ప్రభుత్వానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా సంఘాల సభ్యుల రుణాల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ షేక్, తదితరులు పాల్గొన్నారు.

రూ. 40 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి

భూత్పూర్: కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడిన భూత్పూర్‌లో రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కౌన్సిలర్లను ఎమ్మెల్యే ఆల సత్కరించారు. మంత్రి కేటీఆర్ ఆశీర్వాదంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. భూత్పూర్-అమిస్తాపూర్ దారిలో సెంట్రల్ లైటింగ్, చౌరస్తాలో సుందరీకరణ పనులు, వివిధ వార్డుల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీ రూపురేఖలు మారనున్నాయని అన్నారు. మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో చేపట్టిన అభివృద్ధిపనుల వివరాలతో కూడిన కరపత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు అజీజ్, మల్లమ్మ, షాకీర్‌పాష, పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు అవార్డులు



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో అవార్డులు అందుకుంటున్న పారిశుద్ధ్య కార్మికులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉత్తమ సేవలు అందించిన మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా స్థానిక శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అవార్డులు అందజేశారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాల తరఫున బ్యాంకు రుణం కింద నవభారతి, పిల్లలమర్రి జిల్లా మహిళా సమాఖ్యకు రూ.6.30 కోట్ల చెక్కును సైతం ఇచ్చారు. కాగా ఉత్తమ డీఆర్‌సీసీగా విజయలక్ష్మి (మహేంద్ర మహిళా సంఘం అధ్యక్షురాలు, కుమ్మరివాడీ), ఉత్తమ కంపోస్టింగ్ యూనిట్‌గా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ ఎంపికైంది. ఉత్తమ హోం కంపోస్టింగ్ కింద పద్మ (నరసింహస్వామి మహిళా సంఘం-హనుమాన్‌పురా), అన్నపూర్ణ (గౌతమి మహిళా సంఘం-అప్పన్నపల్లి), మాణిక్యమ్మ (పరిమళ మహిళా సంఘం-హౌసింగ్‌బోర్డు), గీత (మహిమ మహిళా సంఘం-బీకేరెడ్డి కాలనీ), నాగమణి (శ్రీలక్ష్మి మహిళా సంఘం-రామయ్యబౌలి), బి.ఆర్.నిర్మల (48వ వార్డు) కు అవార్డులు దక్కాయి. ఉత్తమ కాలనీ కింద వెంకటేశ్వర కాలనీ-వార్డు నం.1 కౌన్సిలర్ జి.రోజ, పద్మావతి కాలనీ-వార్డు నం.7 కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి, న్యూ టౌన్-వార్డు నం.42 కౌన్సిలర్ రామలక్ష్మణ్‌కు అవార్డు ఇచ్చారు. ఇక ఉత్తమ పబ్లిక్ టాయ్‌లెట్‌గా జీజీహెచ్ వద్ద ఉన్న టాయ్‌లెట్ (విజయ ఫౌండేషన్), పాత డీఈఓ కార్యాలయం పక్కనున్న టాయ్‌లెట్ (జేఎండీ శానిటేషన్-రాకేష్) కు దక్కింది. ఉత్తమ వీధి వ్యాపారులుగా మహమూద్ ఫరూఖ్, స్వప్న, సోఫియా, షహీన్‌సుల్తానా, దీప్తి ఎంపికయ్యారు. ముగ్గుల పోటీల్లో పావని, సుమిత్ర, మంజుల, రబియాబేగం, శ్రీదేవి, అనురాధకు ఉత్తమ బహుమతులు వచ్చాయి. క్రిష్ణవేణి, రజిత, గాయత్రి, భాగ్యలక్ష్మి, చంద్రకళకు కన్సొలేషన్ బహుమతులు ఇచ్చారు. ఉత్తమ ఎస్‌హెచ్‌జీలుగా భవానీ (రాజరాజేశ్వరి మహిళా సంఘం-మోనప్పగుట్ట), అరుణ (బ్రమరాంబిక మహిళా సంఘం-బ్రహ్మన్‌వాడి), పల్లవి (లక్ష్మీసాయి మహిళా సంఘం-రాజీవ్ గృహకల్ప), ఖాజా రహీం (లక్ష్మీప్రసన్న మహిళా సంఘం-రాంనగర్), సలేహ (శ్రీలక్ష్మి మహిళా సంఘం-రామయ్యబౌలి) ఎంపికయ్యారు. ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులుగా రాములు, చెన్నమ్మ, అలివేలు, యాదయ్య, వెంకటనర్సింహులు, జహంగీర్, డి.నాగభూషణం, పర్వతయ్య, ఎస్.శ్రీను అవార్డు పొందారు. ఉత్తమ ఎన్‌యూహెచ్‌గా మాతృమూర్తి అవేర్‌నెస్ సొసైటీకి దక్కింది. ఉత్తమ అధికారులుగా బి.ఐ.బెంజిమన్ (డిప్యూటీ ఈఈ), వెంకటేశ్వరరావు (ఇన్‌చార్జ్ ఏఎంసీ), ఎం.హరికృష్ణ, బి.వైష్ణవి (ఏఈలు), పి.వజ్రకుమార్‌రెడ్డి (హెచ్‌ఏ), సి.లక్ష్మీప్రియ (టీపీఎస్); ఉత్తమ ఉద్యోగులుగా ఎ.నవీన్‌కుమార్ (సీసీ), కె.రవికుమార్, ఈ.శ్రీనివాస్‌రెడ్డి, సి.శ్రీకాంత్ (కంప్యూటర్ ఆపరేటర్లు), ఎం.ఎ.నయీం (అటెండర్), వెంకటేష్ (బిల్ కలెక్టర్) అవార్డు అందుకున్నారు.

హామీలు నెరవేర్చడంలో విఫలం



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో హన్వాడ మండలం యారోనిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని 27వ వార్డు వల్లభ్‌నగర్, గణేష్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, డీసీసీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత, నాయకులు సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబా, లక్ష్మణ్‌యాదవ్, వెంకటయ్య, కృష్ణయాదవ్, మల్లు నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హజ్‌యాత్రికులకు ఘన సన్మానం



హజ్‌యాత్రికులతో కమిటీ సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర హజ్‌యాత్రకు వెళ్తున్న ఎండి.మోసిన్, ఫరీద్‌లను జిల్లా కేంద్రంలోని జామీయ మసీద్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హజ్‌యాత్ర చేయాలని ప్రతి ఒక్క ముస్లిం కోరుకుంటాడని, కాని కొందరికే ఆ అదృష్టం దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల క్షేమం కోసం హజ్‌యాత్రీకులు దువా చేయాలని కోరారు. అనంతరం మౌలానా సఫీర్ అహ్మద్ ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో జామీయ మజీద్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్ అలీ సనా, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జకీ, కోశాధికారి ఇస్మాయిల్, మహమూద్‌అలీ సనా, ముజాహిద్, జహంగీర్‌పాష ఖాద్రీ, సుల్తాన్ పాల్గొన్నారు.

ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం



శిల్పారామం వరకు ర్యాలీగా బయలుదేరిన మున్సిపల్ ఉద్యోగులు, చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్మన్ కేసీ నర్సింహులు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటయ్యాకే పాలమూరు పట్టణం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. అనంతరం క్లాక్‌టవర్ వరకు మున్సిపల్ ఉద్యోగులతో కలిసి ర్యాలీ తీసి మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడి నుంచి నేరుగా శిల్పారామం వరకు ర్యాలీగా బయలు దేరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేష్ కుమార్, కమిషనర్ డి.ప్రదీప్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాత ధ్రువపత్రాలు ఉంటే సరిపోతుంది

మహబూబ్‌నగర్ రూరల్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తహసీల్ కార్యాలయం నుంచి పొందిన కుల ధ్రువీకరణ పత్రం ఉంటే ప్రభుత్వ రూ. లక్ష ఆర్థికసాయం దరఖాస్తుకు ఎలాంటి ఇబ్బంది లేదని మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ బి.పార్థసారథి తెలిపారు. శుక్రవారం సాక్షితో ఆయన మాట్లాడుతూ చాలా మందికి ఈ విషయం తెలియక కొత్త ధ్రువపత్రం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారని, 2021 ఏప్రిల్‌లో జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉన్నా సరిపోతుందని అన్నారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలు జారీ చేసేందుకు ఆన్‌లైన్ సర్వర్ సరిగా పని చేయడం లేదని, దరఖాస్తుల సంఖ్య భారీగా ఉండటంతో సర్వర్ డౌన్ అయి ధ్రువపత్రాల జారీలో కొంత జాప్యం జరుగుతుందన్నారు. జీఓ నంబర్ 5లో మార్గదర్శకాల ప్రకారం రూ. లక్ష సాయానికి బీసీ సామాజిక వర్గానికి చెందిన 15 కులవృత్తుల వారే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, అందులో నాయిబ్రాహ్మణులు, రజక, సగర, ఉప్పర, శాలివాహన, అవుసుల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి, మేదర, వడ్డెర, ఆరెకటిక, మేర, కృష్ణబలిజ పూసల కులవృత్తుల కుటుంబాలతో పాటు ఎంబీసీ వర్గాలకు చెందిన వారు మాత్రమే దరఖాస్తులు సమర్పించేందుకు అర్హులని ఆయన వెల్లడించారు.

చిన్నారులకు ఆర్థికసాయం

కోయిల్‌కొండ: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన వడ్డె పెద్దరాజు దంపతులు పదిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో అనాథలుగా మిగిలిన ముగ్గురు చిన్నారులకు మండలంలోని పారుపల్లి యువకులు, పెద్దలు అండగా నిలిచారు. రూ.59 వేల ఆర్థికసాయం అందించారు. యువకులు శివరాములుగౌడ్, కావాలిసత్యం, శివ, చిరు, రవి తదితరులు ఉన్నారు.

ఏం చేశారని సంబురాలు?



నవాబుపేట: ప్రభుత్వం ఏం అభివృద్ధి చేసిందని సంబురాలు నిర్వహిస్తున్నారని, పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారనా లేక నిరుద్యోగులకు భృతి ఇచ్చారనా? ఏం చేశారని సంబురాలు చేయాలని ప్రశ్నించారు. మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో శుక్రవారం పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ దళితులకు ఇచ్చినహామీలు విస్మరించారని అన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు.

క్విజ్‌లో పాల్గొనాలి

యూత్ డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలలో యువత పాల్గొని బహుమతులు గెలుపొందాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు. స్కూటీ, ల్యాప్‌ట్యాప్, ఫోన్ వంటి బహుమతులు ఉన్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బంగ్లారవి, రాష్ట్ర నాయకులు బాబర్, రాజేష్, ఖాజా, ఎంపీటీసీ రాంచందర్, అజహర్, శ్రీహరి, రమేష్, సలాఉద్దిన్, శ్రీను పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



ఆందోళనకారులను అరెస్ట్ చేసి రాణాకు తరలిస్తున్న పోలీసులు

జడ్చర్ల: పరీక్షకు సమయం లేకపోవడంతో ఓ వర్గానికి చెందిన బాలికను మరో వర్గానికి చెందిన విద్యార్థి తన బైక్‌పై ఎక్కించుకుని సాయం చేయడంతో బాలిక వర్గానికి చెందిన కొందరు సదరు విద్యార్థిపై దాడి చేశారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏబీవీపీ, బీజేవైఎం, బీజేపీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జడ్చర్లలో ఆందోళనలకు దిగారు. మానవతా దృక్పథంతో సాయం చేస్తే మారణాయుధాలతో దాడి చేయడం సరికాదని పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. దాడి చేసిన వారిని ఇప్పటివరకు అరెస్ట్ చేయలేదన్నారు. కాగా ఆందోళనల విషయం తెలుసుకున్న పోలీసులు నాయకులను అడ్డుకున్నారు. అదుపులోకి తీసుకుని డీసీఎంలో రాజాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే కొందరు నాయకులు స్థానిక నేతాజీ చౌరస్తా, గౌరీశంకర్ కాలనీ వద్ద ఆందోళనలు చేపట్టారు. దీంతో పోలీసులు అక్కడకు కూడా వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా రోడ్లపై ఆందోళనలు చేపట్టి రాకపోకలకు అంతరాయం కలిగించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ రమేశ్‌బాబు తెలిపారు. అదేవిధంగా విద్యార్థిపై దాడి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు

రాజాపూర్: జడ్చర్లలో ఓ యువకుడిపై మరో వర్గం వారు దాడి చేయడంతో శుక్రవారం బీజేపీ నాయకులు ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రాజాపూర్ పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. జడ్చర్ల మండల నాయకులను సైతం రాజాపూర్ తీసుకువచ్చి స్టేషన్‌లో ఉంచారు. కాగా ప్రతి చిన్న విషయానికి ఎలాంటి సమాచారం లేకుండా అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని మండల అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు.

ఆందోళన చేసిన వారిపై కేసు

జడ్చర్ల: పట్టణంలో శుక్రవారం రోడ్డుపై ఆందోళన చేసి రాకపోకలకు అంతరాయం కలిగించిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్ బాబు తెలిపారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండా రోడ్డుపై రాస్తారోకోకు ప్రయత్నించిన ఆంజనేయులు, శివశంకర్‌రెడ్డి, సంజీవ, నిఖిత, సాయికిరణ్, శ్యామ్, వెంకటేశ్, నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సిద్ధంగా పంచాయతీల తీర్మానాలు

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని పది గ్రామపంచాయతీల సర్పంచులు, ప్రజాప్రతినిధులు తీర్మానాలు ఇచ్చారని మండల సాధన సమితి కన్వీనర్ రామునాయక్, వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం 146వ రోజు నిర్వహించిన రిలేదీక్షలో వారు మాట్లాడారు. నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పది గ్రామ పంచాయతీల తీర్మానాలు తీసుకువస్తే మండలంగా చేసేందుకు అర్హత ఉంటుందని తెలపడంతో సర్పంచులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. నూతన మండలానికి కావాల్సిన భూమి కూడా ఇచ్చేందుకు దాతలు సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా మండలంగా ప్రకటించేందుకు ముందుకు రావాలని కోరారు.

సీనియర్ సిటిజన్ల హక్కులు కాపాడాలి

నవాబుపేట: సీనియర్ సిటిజన్ల హక్కులు కాపాడాలని ఫోరం జిల్లా కార్యదర్శి నాగభూషణం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తమ హక్కులు కాపాడాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సీనియర్ సిటిజన్లపై చాలా ఇళ్లలో వేధింపులు ఉన్నాయని వాటిపై స్పందించి న్యాయం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫోరం నాయకులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, విజయ్‌కుమార్, వేణునాథం తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేద్దాం

మిడ్జిల్: బీజేపీ ఆధ్వర్యంలో జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల ఇన్‌చార్జ్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రం చేపట్టిన వివిధ పథకాలను ప్రజలకు వివరించి తెలంగాణలో బీజేపీకి అవకాశం ఇవ్వాలనే విషయంలో సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. నాయకులు రాజేశ్వర్, తిరుపతయ్య, వాసుదేవ్, రామకృష్ణ, రాములు, జంగయ్య, అంజీ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

భూత్పూర్: చిన్న చింతకుంట మండలం మద్దూర్‌కి చెందిన వందమందికి పైగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. తెలుగు బలరాం, చిన్న కుర్మన్న, రమేష్, నరసింహ, అంజి, మధు, సహదేవ్ ఉన్నారు.

ఈసారైనా లక్ష్యం నెరవేరేనా..?



రాజాపూర్ శివారులోని నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

రాజాపూర్: అంతరించిపోతున్న అడవులను తిరిగి పెంచేందుకు, గ్రామాల్లో పచ్చటి వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే ప్రతి సంవత్సరం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, జాతీయ ఉపాధిహామీ పథకంలో అవెన్యూ ప్లాంటేషన్ చేస్తున్నారు. కానీ అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. రాజాపూర్ మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీల్లో ప్రతి చోట నర్సరీలను ఏర్పాటు చేశారు. వాటిలో ఎవెన్యూ ప్లాంటేషన్‌కోసం కావాల్సిన మొక్కలను, పండ్లమొక్కలను, ఇళ్లలో పెంచుకునేందుకు పూలమొక్కలను పెంచి వాటిని నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈసంవత్సరం మండలంలో మొత్తం రెండు లక్షల ఇరవై వేల మొక్కలను హరితహారంలో భాగంగా నాటాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. గత సంవత్సరం సైతం దాదాపు ఇదే స్థాయిలో మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నా చేరుకోలేకపోయారని, కనీసం అనుకున్న లక్ష్యం లక్ష్యం నెరవేరుతుందా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న 27,600 మొక్కలను నాటాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రతి సంవత్సరం హరితహారంలో మొక్కలు నాటుతున్నారు కానీ నాటిన తర్వాత వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో చాలా వరకు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా సంరక్షణ చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి అప్పుడే లక్ష్యం నెరవేరుతుంది. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తోంది.కానీ కొందరి నిర్లక్ష్యం వల్ల అనుకున్న లక్ష్యం సాధించలేక పోతున్నాం. ఇప్పటికైనా జాగ్రత్తగా వ్యవహరించాలి.

– వెంకట్‌రెడ్డి, రైతు, ఖానాపూర్

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించి మొక్కల పెంపకం, నాటిన మొక్కలను ఎండిపోకుండా చర్యలు తీసుకునేందుకు గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తునే ఉన్నాం. జాతీయ రహదారిపై నాటిన మొక్కలకు సైతం గ్రామపంచాయతీ సిబ్బందిచే నీళ్లు పోయిస్తున్నాం. ఈనెల 19న మండలంలోని అన్ని గ్రామాల్లో 27 లక్షల మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– లక్ష్మీదేవి, ఎంపీడీఓ, రాజాపూర్

ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా పోయింది

- మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైనం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధాశ్రీ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలో ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా పోయిందని శుక్రవారం ఎంపీపీ సుధాశ్రీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.నాలుగు సంవత్సరాలుగా ఒక్క సమస్యను కూడా అధికారులు పరిష్కరించలేదని ధర్మాపూర్, గాజులపేట సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, కోడూర్ ఎంపీటీసీ రాజుగౌడ్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ఏమాత్రం కృషి చేయడం లేదని అన్నారు. ఎంపీటీసీ రాజుగౌడ్ కోడూర్‌లో పెచ్చులూడిపోయిన వాటర్‌ట్యాంకుకు మరమ్మతు చేయాలని నాలుగేళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గాజులపేట సర్పంచ్ చంద్రశేఖర్ గ్రామంలో నూతనం వాటర్‌ట్యాంకు విషయం ప్రతీ సమావేశంలో అధికారుల దృష్టికి తెస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. భవాని తండా సర్పంచ్ ఫతేపూర్ గ్రామంలో పశువైద్యశాల లేకపోవడం వల్ల రైతులకు ఇబ్బందిగా మారిందని తప్పనిసరి పరిస్థితుల్లో బండమీదిపల్లి కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు అధికారుల వైఖరిని సమావేశంలో తీవ్రంగా నిరసించారు. సభ్యుల ఆవేదనను పరిగణనలోకి తీసుకున్న ఎంపీపీ సుధాశ్రీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కె.అనిత, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ పాండు, ఎంపీఓ నరేందర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



నవాబుపేట: చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎస్‌ఐ పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఊరంచుతండాలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి చట్టానికి ఒక సెక్షన్ ఉంటుందని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు ఫోన్లు, బైక్‌లు ఇవ్వకూడదన్నారు. సర్పంచ్ గోపాల్, హెచ్‌ఎం రెహనా బేగం ఉన్నారు.